కుమారి ఆంటీని చుట్టుముట్టిన నిరుద్యోగులు

● సీఎం స్పందించేలా చూడాలని విజ్ఞప్తి

రాయదుర్గం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): యుట్యూబ్‌లో వీడియోలతో ఫేమస్ అయిన ఫుడ్‌సెంటర్ నిర్వాహకురాలు కుమారి ఆంటీ ఫుడ్ సెంటర్ వద్దకు శనివారం పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు 'హైదరాబాద్ వాళ్లకు 40 మార్కులు వస్తే ఉద్యోగాలు ఇచ్చారు.. మాకు 130 మార్కులు వచ్చినా ఉద్యోగాలు రాలేదు'అని కుమారి ఆంటీకి వివరించారు. మాబాధలు ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. 'మీరు ఒక్కమాట చెబితే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. మా సమస్యపై మీరు మాట్లాడండి.. మాకు ఉద్యోగాలు వస్తాయి'అని ఆమెకు వినతి పత్రం ఇచ్చేందుకు ప్రయత్నించారు. జీవో 46 పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని ఆమెను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా కుమారి ఆంటీ మాట్లాడుతూ తనకు వీటి గురించి తెలియదని, సీఎం ప్రజా పాలకుడని ఆయనకు మనం చెప్పాల్సిన అవసరం లేదని, తనను ఇబ్బంది పెట్టవద్దని వేడుకుంది. 'త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి మీ దగ్గరకు వస్తున్నారు.. ఆ సమయంలో మా సమస్యలను సీఎంకు చెప్పి వినతిపత్రం ఇవ్వాలని' విజ్ఞప్తి చేశారు. అనంతరం అక్కడి నుంచి నిరుద్యోగులు వెళ్లిపోయారు.

కార్పొరేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ షురూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైటెక్ సిటీలోని గేమ్ పాయింట్ అకాడమీ కార్పొరేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు ఆతిథ్యమిస్తోంది. సుమారు 150 మందికి పైగా షట్లర్లు పాల్గొనే ఈ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమవనుంది. కార్పొరేట్ ఉద్యోగులకు పని ఒత్తిడి నుంచి ఉపశమనం కల్గించడంతో పాటు, ఫిట్‌నెస్, ఆరోగ్యం భద్రతపై అవగాహన కల్పించేందుకు ఐదో సీజన్‌ను నిర్వహిస్తున్నట్టు గేమ్ పాయింట్ సహ వ్యవస్థాపకుడు సిద్ధార్థ్ రెడ్డి తెలిపారు.



కార్యక్రమానికి హాజరైన అతిథులు

పోటీ తత్వాన్ని పెంచుకోవాలి

నిజాంపేట్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలో కాసాని కౌసల్య ముదిరాజ్ మెమోరియల్ 49వ జూనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు శనివారంతో ముగిశాయి. గెలుపొందిన విజేతలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. పోటీ తత్వాన్ని పెంచుకున్నప్పుడే అన్ని రంగాల్లో వెళ్తామని వారన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం

చందానగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చందానగర్‌కు చెందిన డ్యాన్స్ మాస్టర్ మురళీ కుమారుడు సముద్రాల విగ్నేష్ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలల ఫీజుల కోసం హోప్‌ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

మల్కాజిగిరి పార్లమెంట్ కోసం దరఖాస్తు

బాలానగర్/ కూకట్‌పల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ తన బయోడేటాను గాంధీభవన్‌లో అందజేశారు. శనివారం ఆఖరు తేదీ కావడంతో తన అనుచరులతో కలిసి దరఖాస్తును అందజేశారు. అధిష్ఠానం అవకాశం కల్పిస్తే ఎంపీగా పోటీ చేసేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు.



గాంధీ భవన్‌లో దరఖాస్తు అందజేస్తున్న బండి రమేష్

జీడిమెట్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పార్లమెంట్ టికెట్ తనకు కేటాయించాలని టీపీసీసీ కాంగ్రెస్ కమిటీ అఫీషియల్ స్పోక్ పర్సన్ డాక్టర్ చింతల యాదగిరి దరఖాస్తు చేసుకున్నారు. గాంధీభవన్‌లో దరఖాస్తు సమర్పించిన యాదగిరి వరంగల్, మల్కాజిగిరి, లేదా భువనగిరి పార్లమెంట్లలో ఏదో ఒక సీటు కేటాయించాలని విన్నవించారు.



గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేస్తున్న డాక్టర్ చింతల యాదగిరి

షబ్బీర్ అలీకి శుభాకాంక్షలు



తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుడిగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ షబ్బీర్ అలీని కాంగ్రెస్ కూకట్‌పల్లి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం శనివారం సెక్రెటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

- ఫతేనగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి)



● ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ షబ్బీర్ అలీని శనివారం సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

- మియాపూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి)

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

బాలానగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను కార్మికులంతా విజయవంతం చేయాలని ఏఐటీయూసీ కూకట్‌పల్లి నాయకులు కార్మికులకు పిలుపు నిచ్చారు. ఈసందర్భంగా శ్రీశ్రీనగర్‌లో ఉన్నఏఐటీయూసీ కార్యలయంలో పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శి హరినాథరావు నాయకులు రాజుగౌడ్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గుంతను తప్పించబోయి జీప్ పల్టీ!

● ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

పేట్ బషీరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి ఓపెన్ టాప్ జీప్ పల్టీ కొట్టిన ఘటనలో బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన నాగరాజు(21) మైసమ్మగూడలోని వసతి గృహంలో ఉంటూ, మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(ఎంఆర్‌సెట్)లో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. కళాశాలలో ఫెస్ట్ ఉన్నందున అద్దెకు తెచ్చుకున్న ఓపెన్ టాప్ జీప్‌లో సాయిచరణ్, నాగరాజు, దిలీప్, చరణ్ సిద్ధార్థ్ కలిసి మైసమ్మగూడ నుంచి దూలపల్లి మీదుగా మైసమ్మగూడకు వెళ్తుండగా ఫారెస్ట్ అకాడమీ మార్గం మధ్యలో రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయిన చరణ్ సిద్ధార్థ్ జీప్‌ను లెఫ్ట్‌కు తిప్పడంతో పల్టీ కొట్టింది, దీంతో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. తీవ్ర గాయాల పాలైన నాగరాజును సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. 100 ఫోన్ నెంబరు ద్వారా విషయం తెలుసుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాధిత విద్యార్థులు చదువుతున్న మల్లారెడ్డి కళాశాలకు రెండ్రోజుల పాటు యాజమాన్యం సెలవు ప్రకటించింది.

కాటేస్తోన్న కాలుష్యం



నివాస ప్రాంతంలో కెమికల్ గోదాం

- జీడిమెట్ల పారిశ్రామిక వాడలో అక్రమ కెమికల్ గోదాంలు
- ఊపిరి పీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరి
- మూసివేయాలంటున్న స్థానికులు

ఇక్కడ కాలుష్యం కాటేస్తోంది. పీల్చేగాలి పూర్తిగా విషమైంది. భూగర్భజలాలు విషతుల్యంగా మారి ముట్టుకోవడానికి కూడా పనికిరాకుండాపోయాయి. దశాబ్దాల కాలంగా జీడిమెట్ల పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమలు విడుదల చేస్తున్న ప్రాణాంతకమైన విషవాయువులు, కాలుష్య జలాలతో అంతుబట్టని వ్యాధులతో జనం అల్లాడిపోతున్నారు. కొందరు చనిపోతున్నారు. చిన్నపిల్లలు, గర్భిణిలు చీకటిపడితే ఊపిరి పీల్చుకోవడం కష్టతరంగా మారింది. వృద్ధుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది.

జీడిమెట్ల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామిక వాడలో ఉన్న దాదాపు 86 రసాయన పరిశ్రమల నుంచి విడుదలవుతున్న విషవాయువులతో ప్రజలు సతమతమవుతుంటే, కొందరు దనార్జనే ధ్యేయంగా నివాస ప్రాంతంల్లోనే అక్రమంగా కెమికల్ గోదాంలను ఏర్పాటు చేసి ప్రమాదకర రసాయన డబ్బాలను నిల్వచేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొచ్చి అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయో తెలియక ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. గోదాంలు, పరిశ్రమలను తరలించండని ఎన్నిసార్లు విన్నవించినా స్థానికుల గోడు వినేవారే లేరు.

నివాసాల మధ్యే

జీడిమెట్ల పారిశ్రామికవాడ ప్రాంతంలోని గంపల బస్తీ, సుభాష్‌నగర్, ఎస్‌వీ కోపరేటివ్ సొసైటీ వెంకటాద్రినగర్, రామిరెడ్డినగర్, సాయిబాబానగర్ ప్రాంతాల్లో విచ్చలవిడిగా కెమికల్ గోదాంలు వెలిశాయి. కొందరు నగర శివార్లలోని జీడిమెట్ల, ఖాజిపల్లి, బొల్లారం, బొంతపల్లి, పటాన్‌చెరువు, కాటేదాన్, నల్లగొండ ప్రాంతంలోని చిట్యాల పారిశ్రామికవాడల నుంచి కెమికల్ డబ్బాలను లారీల్లో తీసుకొస్తున్నారు. వ్యర్థ రసాయన జలాలను ఈ కెమికల్ డబ్బాల్లో తీసుకొచ్చి నివాస ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెమికల్ గోదాముల్లో డంపు చేస్తున్నారు.

గోతులు తీసి భూమిలో వ్యర్థ రసాయనాలు..

సమీపంలోని నాలలు, గోదాంల్లో గోతులు తీసి భూమిలోకి పంపిస్తున్నారు. దీంతో విపరీతమైన వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిశ్రమల యాజమాన్యాలు ఈ వ్యర్థ జలాలను ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు తరలించకుండా ట్యాంకర్ల ద్వారా ఈ అడ్డాలకు తరలించి చేతులు దులుపుకుంటున్నారు. తక్కువ ఖర్చుతో వ్యర్థ జలాలు వదిలించుకొని ఎక్కువ లాభాలు పొందుతున్నారు. ఫలితంగా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. గతంలో మేడ్చెల్ కలెక్టర్‌గా ఉన్న ఎంవీ రెడ్డి 104 కెమికల్ గోదాంలను గుర్తించి వాటిని మూసివేయించారు. మళ్లీ అవి యధావిధిగా నడుస్తున్నాయి. ప్రధానంగా గంపలబస్తీలోని అక్రమ దందాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. కొందరు కాలనీ అసోసియేషన్ ముసుగులో అక్రమ కెమికల్ దందా సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీడిమెట్ల ప్రాంతంలోని అక్రమ కెమికల్ గోదాంలను తరలించాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.



అక్రమ కెమికల్ గోదాంలను తరలిస్తాం

జీడిమెట్ల పారిశ్రామికవాడలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నడుస్తున్న కెమికల్ గోదాంలను గుర్తించి వాటిని తరలించడానికి చర్యలు తీసుకుంటాం. గతంలో మాదిరిగా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కెమికల్ గోదాంలపై చర్యలు తీసుకుని ప్రజలకు రక్షణ కల్పిస్తాం. ప్రధానంగా వ్యర్థ రసాయనాలను గోదాంలకు తరలిస్తున్న పరిశ్రమలను గుర్తించి చర్యలు చేపడతాం.

- రాజేందర్, ఈఈ, కాలుష్య నియంత్రణా బోర్డు

ఐఎన్‌టీయూసీతో సమస్యల పరిష్కారం

బాలానగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ పరమవుతున్నాయని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి బీడీఎల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు అహ్మదుల్లా అన్నారు. శనివారం బాలానగర్ హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్‌లో హెచ్‌ఏఎల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధం) జనరల్ బాడీ సమావేశానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వల్లనే ప్రభుత్వ రంగ సంస్థలు మనుగడ సాగించాయన్నారు. ఐఎన్‌టీయూసీతోనే కార్మిక సమస్యలు పరిష్కారం కాగలవన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గోపాలకృష్ణ, బందాలి, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శి విజయప్రసాద్, కర్కనాగరాజు, సబ్లతుల్లా, గ్యానేశ్వర్, భారతి, వెంకటపతి, గణేష్, ప్రవీణ్, శ్రీకాంత్, భాస్కర్, అన్వర్, నాగార్జున వెంకటేశ్ పాల్గొన్నారు.



కమిటీ సభ్యులతో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి అహ్మదుల్లా, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి

నూతన కార్యవర్గం ఎన్నిక

హెచ్‌ఏఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం సభ్యుల ఎన్నిక శనివారం జరిగింది. యూనియన్ సలహాదారులుగా గోపాలకృష్ణ, అల సత్యనారాయణ, బషీరుద్దీన్, అధ్యక్షుడిగా మహ్మద్ సబ్లతుల్లా, ప్రధాన కార్యదర్శిగా కర్క నాగరాజు ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటపతి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా పోలేపల్లి శ్రీకాంత్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా వాజీద్ అలీ, ఉపాధ్యక్షులుగా వీవీఎస్ రమేష్, మెప్రూలా, శ్యాంసుదర్, కోశాధికారిగా బాబురావు, డిప్యూటీ కోశాధికారిగా రావూఫ్, సీనియర్ జాయింట్ సెక్రెటరీగా లక్ష్మణ్, కరీం హృదయతుల్లా, చంద్రశేఖర్ జాయింట్ సెక్రెటరీలు, సీనియర్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలు ఎన్నికయ్యారు.

ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి

మియాపూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉపాధిలేక ప్రజాభవన్ ఎదుట ఆటోను తగలబెట్టుకున్న మియాపూర్ నడిగడ్డ తండాకు చెందిన ఆటో డ్రైవర్ ఎం.దేవ్లానాయక్ కుటుంబాన్ని శనివారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ పరామర్శించారు. ఆటోడ్రైవర్ దేవ్లానాయక్ కుటుంబానికి తాము అన్నివిధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. తాము మహిళల ఫ్రీ బస్ ప్రయాణానికి వ్యతిరేకం కాదని, ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలకు వెంటనే అడ్డుకట్ట వేయాలన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న ఆటోడ్రైవర్ల కుటుంబాలకు రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ఉపాధి కోల్పోయిన ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి నెలకు రూ. 10వేలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో చందానగర్, మాదాపూర్ డివిజన్ల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, పార్టీ నాయకుఉల, స్థానికులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్ దేవ్లానాయక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

ఫెర్మిగో అండ్ ఎక్స్‌పో

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల దశ నుంచే నూతన ఆవిష్కరణలను చేసి భవిష్యత్తులో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి మాణిక్యానగర్‌లోని ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో నిర్వహించిన ఫెర్మిగో అండ్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌లో ఎమ్మెల్యే, పాఠశాల చైర్మన్ నల్లపాటి వెంకటేశ్వరరావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు చేసిన ఆవిష్కరణలను శనివారం పరిశీలించారు. అంతకుముందు పాఠశాల ప్రిన్సిపాల్ గ్రీష్మజ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రాంభించారు. ఈ ఎక్స్‌పోలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో పాటు వివిధ రకాల వంటకాలు చేశారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యకప బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులు చేసిన వంటలను రుచి చూస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ప్రాంతాల పరిశీలన

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపల్ పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని నాలుగు వందల మంది ప్లాట్ యజమానులు కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని శనివారం ఆయన నివాసంలో కలిశారు. ఈసందర్భంగా ఆ ప్రాంతాల్లో నీటి పారుదల శాఖా అధికారులతో కలిసి హన్మంత్‌రెడ్డి, ప్లాట్ల యజమానులు పర్యటించారు. ఈ స్థలం ఎఫ్‌టీఎల్‌లోనే ఉందని, మట్టి పోసిన వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, వారిపై ఎఫ్ఐఆర్ నమోదయ్యాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్లాట్ల యజమానులు, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్, మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, శివకుమార్, నీటిపారు దల శాఖా అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కొలన్ హన్మంత్ రెడ్డి

రెండో రోజు ప్రభల తీర్థం పల్లె జాతర

గచ్చిబౌలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నల్లగండ్ల అపర్ణ సరోవర్‌లో ప్రభల తీర్థం పల్లె జాతర రెండో రోజు శనివారం అత్యంతవైభవంగా నిర్వహించారు. భక్తులు, మహిళలు, వృద్ధులు, పిల్లలు ఆట పాటలతో సందడి చేశారు. మగవారు చిన్నప్పుడు పల్లెలో ఆడుకున్న ఆటలను ఆడుతూ ఉల్లాసంగా.. గడిపారు. మొత్తం 14 బ్లాక్‌ల ముందు 14 లోకాలుగా తీర్చిదిద్ది ఓ బ్లాక్‌ముందు ఒక్కోరకం ముగ్గువేసి అపర్ణసరోవర్‌కు వన్నెతెచ్చారు. ముందుగా ఈశ్వరుడికి పాయసం వండి సూర్య శివారాధన భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. ఈవేడుకలకు గోదావరి జిల్లాల నుంచి గ్రామస్తులు విచ్చేసి ప్రభలు తయారీకి శ్రీకారం చుట్టారు. ప్రభలనే ఈశ్వరుడి స్వరూపంగా ఆరాధిస్తారు. ప్రత్యేకమైన హ్యాండిక్రాఫ్ట్స్, ఆరానిక్స్ స్టాల్స్‌ను ఏర్పాటుతో పల్లె వాతావరణం నెలకొంది.



కబడ్డీ ఆడుతున్న అపర్ణసరోవర్ వాసులు

పార్టీ మారే ఆలోచన లేదు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారే ఆలోచన తనకు లేదని, కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేసే వరకు ఆయనతోనే నడుస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లిలోని ఎస్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ మెజార్టీతో గెలిపించిన కూకట్‌పల్లి ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వానికి 200 రోజులు సమయం ఇస్తున్నామని, అప్పటిలోగా అమలు చేయలేకపోతే ప్రభుత్వంపై పోరాడతామన్నారు. ఢిల్లీలో తెలంగాణ నినాదం వినిపించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు, కార్పొరేటర్లు, నియోజకవర్గ ముఖ్యనాయకులు సతీష్ అరోరా, గొట్టిముక్కల వెంగళరావు, చామకూర భద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

'ప్రజాపాలనపై వస్తున్న ఆదరణ ఓర్వలేకే ఆరోపణలు'

కూకట్‌పల్లి/బాలానగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రజాపాలనపై ప్రజల్లో వస్తున్న ఆదరణ చూడలేకనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

● కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కుతున్న బీఆర్ఎస్ నాయకులు తమ ధోరణిని మార్చుకోవాలని బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లిలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన వాఖ్యలను ఆయన ఖండించారు.



● దుండిగల్ మున్సిపల్‌లోని బహదూర్‌పల్లిలో జరిగిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి హాజరైన మాజీ మంత్రి కేటీఆర్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగరాజు యాదవ్

- దుండిగల్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి)



● కూకట్‌పల్లిలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

- ఫతేనగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి)

బైక్ ర్యాలీగా వెళ్లిన కార్యకర్తలు

బాలానగర్/ఓల్డుబోయినపల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి బాలానగర్, ఓల్డుబోయినపల్లి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఓల్డుబోయినపల్లి, బాలానగర్ డివిజన్ల కార్పొరేటర్లు ముద్దం నర్సింహయాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి బస్తీల్లో ర్యాలీ నిర్వహిస్తూ సభా స్థలికి వెళ్లారు.



ఓల్డుబోయినపల్లి డివిజన్ నుంచి బైక్‌పై ర్యాలీగా వెళ్తున్న నాయకులు

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న పరిణామాలపై విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని మేడ్చల్ జిల్లా డీఈవో విజయకుమారి అన్నారు. కూకట్‌పల్లిలోని ఉన్నత పాఠశాలలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సోషల్ టాలెంట్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుచారి, రాంరెడ్డి, కిషన్, సుబ్బారావు, మదన్‌రెడ్డి, శ్రీనయ్య, శివాజీ, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో విజయకుమారి

వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని, సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని కేర్‌వుడ్ పాఠశాలల కరస్పాండెంట్ కె.రజనీ అన్నారు. మూసాపేటలోని పాఠశాల ఆవరణంలో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

- కూకట్‌పల్లి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి)

జవహర్‌నగర్‌లో 30 సీసీ కెమెరాలు ఏర్పాటు

చందానగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): చందానగర్ జవహర్‌నగర్‌లో గోపాల్ రూ. 2.50 లక్షల ఆర్థిసాయంతో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను శనివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు మంజుల, ఉప్పలపాటి శ్రీకాంత్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని గాంధీ అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు నాగేశ్వరరావు, రఘు, కాలనీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శిల్ప కళావేదికలో చిరంజీవికి సన్మానం

మియాపూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పద్మవిభూషణ్ గ్రహీత చిరంజీవి సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమస్యల పరిశీలన

మియాపూర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో శనివారం కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, త్వరలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇలియాస్ షరీఫ్, వీరందర్‌గౌడ్, సంజీవరెడ్డి, రఘునందన్‌రెడ్డి, యాదగిరిగౌడ్, కృష్ణముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, సాంబశివరావు, సయ్యద్ తహెర్ తదితరులు పాల్గొన్నారు.

'టార్గెట్‌ను అధిగమిస్తాం'

గచ్చిబౌలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పన్ను వసూళ్లలో టార్గెట్‌ను అధిగమిస్తామని శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ రజనికాంత్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 280 కోట్ల టార్గెట్ ఉందని జనవరి వరకు రూ. 2.10 కోట్లు వసూళ్లు చేశామని, మార్చి 31లోగా మొత్తం వసూళ్లు చేస్తామన్నారు. బిల్లు కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు రోజువారిగా టార్గెట్లు ఇచ్చి వసూళ్లు చేస్తామని తెలిపారు. మొండిబకాయి దారులకు నోటీసులు ఇస్తున్నామని, వారు స్పందించకుంటే ఆస్తులను జప్తు చేస్తామని తెలిపారు.

కార్పొరేటర్ పాదయాత్ర

గచ్చిబౌలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి గోపీనగర్‌లో శనివారం కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలు, సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరేశంగౌడ్, రాజేశ్వరమ్మ రవీందర్‌గౌడ్, పర్వీన్‌బేగం, కేఎన్‌రాములు, దాకయ్యగౌడ్, లీలానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'మ్యాన్ హోల్‌పై మూత పెట్టండి'

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ హెచ్‌ఏఎల్ కాలనీ 6వ రోడ్డులో నూతనంగా సీసీ రోడ్డు వేసి మ్యాన్ హోల్‌పై మూతను మరిచారు. గాజులరామారం ప్రధాన రహదారిపై జీడిమెట్ల డిపోకు నిత్యం వాహనాలు రద్దీగా ఉం టాయి. మ్యాన్‌హోల్‌పై మూత పెట్టకుండా కట్టెను పెట్టడంతో రాత్రి వేళ వాహనదారు లు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. తక్షణమే మ్యాన్‌హోల్‌పై మూతను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా మ్యాన్ హోల్